


# సర్పశిల

## - భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ :1 (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

✾✾✾

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

✾✾✾

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

✾✾✾

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

✾✾✾

*ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.*

*ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.*

*ఎపిసోడ్ 7: (జూలై)*

*తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.*

*ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.*

*మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.*

*ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)*

*ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.*

*ప్రకృతి నాశకులు రాక్షసులు*

*ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.*

*ఎపిసోడ్ --0*

*అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.*

*తరువాయి భాగం చదవండి ...*

**జయదేవ్, సుదర్శన్**, రాబీ, శాస్త్రిగారు, యజ్ఞప్ప, మదాలస అందరూ సమావేశమయ్యారు.

"మనం ఇక్కడ కూర్చుని చేసేదేదీ లేదు. యుద్ధాన్ని ఎవరో మొదలెట్టడం వరకూ ఎదురు చూసేకంటే, యుద్ధం తప్పదని అనుకున్నప్పుడు మనమే మొదలు పెట్టడం అన్ని విధాలా మంచిదే, గెలిచినా ఓడినా మొదటి దెబ్బ మనమే తీస్తాం. శాస్త్రిగారు, యీనాటివరకూ పరిస్థితిని సమీక్షిస్తే, మనం వచ్చిన రోజున ఏ పొజిషన్‌లో వున్నామో ఇప్పుడూ అక్కడే వున్నాం" చర్చ మొదలెట్టాడు సుదర్శన్.

"ఎక్కడో ఏదో జరుగుతున్న విషయం రాబీద్వారా విన్నాం. మహా భారతకాలం నాటి ఆయుధాల గురించీ విన్నాం. శ్రీనివాస్ ఎక్కడున్నాడో తెలియక పోయినా, విలియమ్స్ తో వున్నాడు గనక రక్షిత స్థితిలోనే వుంటాడనీ అనుకున్నాం" తన వంతుగా చెప్పాడు జయ్.

"తక్షపురం సంగతీ అనుకున్నాం. కానీ మాట ముందుకు సాగలేదు. నిన్నటివరకూ రాబీ స్థితి డోలాయమానంగా ఉంది. స్పృహ, నిద్రల మధ్య. ఇప్పుడు సంపూర్ణ జాగ్రదావస్థకు వచ్చినా ఏమీ గుర్తులేని స్థితి అతనిది" యజ్ఞప్ప అన్నారు.

"నా వరకూ నాకు మాత్రం ఇదంతా 'మరోసారి కన్న' కలలా వుంది. మనందరం ఎప్పుడో ఇలాగే కలిసినట్టూ, చర్చించుకున్నట్టూ, విడిపోయినట్టూ మళ్ళీ కలిసినట్టూ" కళ్ళు మెరుస్తుండగా ఓ తన్మయ స్థితిలో అన్నది మదాలస.

అన్నీ వింటూ మౌనంగా వున్నారు శాస్త్రిగారు. ఆయనలో ఓ అనంతమైన గుబులు సుడులు తిరుగుతోంది.

"నాకిప్పుడు తొంభై ఆరు సంవత్సరాలు. చదివానో చదవలేదో, తెలుసుకున్నానో తెలుసుకోలేదో, నా పూర్వీకుల నుంచి నాకు సంక్రమించిన సంస్కృతినీ, పద్ధతులనే పాటిస్తూ వచ్చాను. ఒక పక్కగాయత్రి ఉపాసన చేస్తూనే మరో పక్క శబర మంత్రాలనీ ఔపోసన పట్టాను. జ్యోతిష్యమూ, వాస్తూ గణితమూ కూలంకషంగా నేర్చుకుంటూనే చార్వాక సిద్ధాంతాలనీ ఆకళింపు చేసుకున్నాను. ఇవన్నీ నేనెందుకు చేశాను? ఎందుకు చెయ్యాల్సి వచ్చిందీ? ఇవన్నీ నాలోని జవాబులేని ప్రశ్నలే" ఆగారు శాస్త్రిగారు. వినడం మిగతావారి వంతు అయింది.

"పుట్టడం – పెరగడం – చావడం ఇదే నా జీవితమంటే? నేర్చుకున్నదంతా చివరికి నేలపాలు కాక తప్పదా? అసలెవరైనా జీవితంలో సాధించగలిగేది ఏది? ఇవన్నీ ప్రశ్నలే. అవే అవే ప్రశ్నలు. జవాబు లేకున్నా ముందుకే నడిచాను. జవాబులు ఉంటాయి. కానీ ఆ జవాబులు మనసుకి సంతృప్తిని ఇవ్వడంలేదు. ఆ మహా సంతృప్తి కావాలంటే స్పష్టమైన జవాబులు లభించాలి. అలా స్పష్ట పరిచే గురువేడీ? నా జీవితంలో ధనంకన్నా, విద్యలకన్నా, అన్నిటికన్నా నేను వెతుక్కున్నదీ వెతుక్కుంటున్నదీ ఒక్క గురువునే. అనేకమంది 'గురు' రూపంలో దర్శనమిచ్చారు. విద్యని ప్రసాదించారు. కానీ నాక్కావలసింది లౌకికమైనవి కాదు. అయ్యా, దిశానిర్దేశం చేసే స్థితిలో నేను లేను. కనుక నేను చెప్పేది ఒక్కటే. మీ నిర్ణయాన్ని నేను సగౌరవంగా తలకెత్తుకుంటాను. మీరే నిర్ణయించండి" అందరివంకా చూసి మాటలు ముగించారు శాస్త్రిగారు.

ఓ గాఢమైన మౌనం ఆ విశాలమైన గదిని ఆక్రమించింది. ఏం చెప్పాలో ఎవరికీ తెలీలేదు. అందరూ అవాక్కయ్యారు.

"తాతగారూ, మీరన్న ప్రతిమాటా మీ గుండెల్లోంచి వస్తోంది. ఓ విధంగా చూస్తే రాజైనా పేదైనా గుడ్డిగా జీవితాన్ని వెళ్ళదీస్తున్నారేకానీ, స్పష్టమైన అవగాహనతో ఎవరూ జీవించడంలేదు. అన్నీ నిజాలు నిజాలని భ్రమింపజేసే భ్రమలే. ఇప్పుడు మనం ఉన్న స్థితీ అలాంటి భ్రమలాంటిదే, ఈలోకానికి ఏదో విపత్తు ముంచుకొస్తోందని కొన్ని ఆధారాలు చెబుతున్నాయి. ఆ విపత్తు లక్షణం మనకి తెలీదు. అయ్యా మా నాయనగారు తన డైరీలో వ్రాసుకున్నారు, "కాలం అనే మహా ప్రవాహంలో నేనూ ఓ బిందువుని. కాలం అనే మహా యంత్రంలో నేనూ ఓ చిన్న మర మేకుని కాలం అనే బలీయమైన హస్తాల్లో నేనూ ఓ చిన్న పనిముట్టుని. నాకు నేనుగా ఏమీకాను. ఏదీకాను. కానీ ఓ కాలమా, నీతో కలిసినప్పుడు నేను 'స్వరాన్ని' అని. అందుకే అన్ని ఆలోచనలనూ ప్రస్తుతానికి వదిలేద్దాం. ప్రశాంతంగా ప్రకృతి ఒడిలో విశ్రమిద్దాం. మనం ఏం చెయ్యాలో కాలమే నిర్ణయిస్తోంది" ప్రశాంతంగా అంది మదాలస. "మంచిమాట అన్నావు తల్లీ" మదాలస తల నిమిరి అన్నారు యజ్ఞప్ప. అర్ధాంతరంగా చర్చ ముగిసింది.

"ఉత్తరాన్నొక ధార
దక్షిణాన్నొక ధార
తూర్పు పడమరలందు
వెల్లువై ఒకధార
మూలమూలల యందు
ముత్యాల ధారలే
దిక్కులవిసేలాగ
ఉరుములూ మెరుపులే
సింహాద్రి లోయలో
సింహమై గర్జించె
తలకోన అడవిలో
పులిలాగ గాండ్రించె
రాళ్ళు రప్పలు తప్ప
మొక్కలేని చోట
ముప్పులా పుట్టింది

నీడలా పెరిగింది

భూమిలోపల సుడులు

తిరుగుతూ పెరిగింది

సుడిగాలిలా మారి

ఊరూర తిరిగింది."

చింపిరి జుట్టుతో అరవై అయిదేళ్ళు దాటిన తాత పాడుతున్నాడు.

"ఏంట్రా దక్షుడూ... ఏమిటా పాట?" అడిగాడు సోములు.

"నాకేం తెల్దండి. నోటి కొచ్చింది పాడడం నోటి దురదండి" నవ్వాడు తాత.

"ఎవరు నేర్పారు?" అడిగాడు సోములు.

"నాకెవరు నేర్పుతారండీ? ఏదో వూరూరా తిరుగుతూ వుండేవాడినండీ. అక్కడో ముక్క ఇక్కడో ముక్క" నవ్వాడు దక్షుడు.

"అర్థంలేనట్టు అనిపిస్తున్నా ఏదో అర్థం వుండే వుంటుంది. చుట్ట వెలిగించి అన్నాడు సోములు.

"పరమేశ్వర శాస్త్రిగారని నిన్ను కలుస్తానని చెప్పమన్నారు. చెప్పారుకదా.. కలిశారా?" అడిగాడు సోములు. అతనిది దోసకాయల బండి.

"లేదు. ఆరిలాంటి వాళ్ళు కలవాలంటే అదురుష్టం వుండాలండీ. అయినా సోములుగారూ.. ఊరూరా తిరుగుతారుగదా.. విశేషాలు ఏంటండీ?" దక్షుడు అడిగాడు.

"లోకంలో విశేషాలకి ఏం కొదవ. లోకం అంటేనే విశేషం కదా. దక్షుడూ, లోకం తీరు మారింది. మనిషి మనిషిగా లేడు" పొగ గట్టిగా పీల్చుకుని అన్నాడు సోములు.

"ఏమయిందండీ?"

"యంత్రాలయ్యా.. యంత్రాలు.. అన్నీ యంత్రాలే. రేపో ఎల్లుండో మనిషి ఆలోచించడం కూడా మానేస్తాడు. దానికీ యంత్రాలొస్తాయి. తిండి మారింది. తీరు మారింది. బతుకే మారింది. అయినా మనబోటి గాళ్ళ తిప్పలు మాత్రం తగ్గవు" ఓ చుట్ట దక్షుడికి ఇస్తూ అన్నాడు సోములు.

"మా బతుకైతే మరి ఘోరం. మేం పిచ్చికుంట్ల వాళ్ళం. కాపు, యాదవ, కమ్మ, ఇతర కులాల వంశ, కుల, గోత్ర ప్రాభవాలు చెప్పి వాళ్ళిచ్చే సంభావనలతో బ్రతికేవాళ్ళం. శ్రీశైల మల్లన్నే మా శృతి, గతి. కోటిగోత్రనామాలు చెప్పేవాళ్ళు మా వాళ్ళల్లో ఉద్దండులు. ఇక కథల సంగతి సరేసరి. మావాళ్ళు కథ చెపితే వూళ్ళకి వూళ్ళు పులకించి పోయేవి. మాకు తెలిసినన్ని కమ్మ, కాపు గోత్రాలు ఆ కులం వాళ్ళకే తెలీదు మరి. అయ్యా, ఊళ్ళు తిరిగేవాళ్ళం. ఏ వూర్లో కాలుపెట్టినా మా

చేత గోత్రాలూ వంశ ప్రాభవాలూ చెప్పించుకుని మహా గౌరవించేవాళ్ళు. ఇవ్వాళ మేమేకాదు, జానపదానికి ప్రాణం పోసిన శారాద కాంద్రు జలగాలు, దాసర్లు, బుడబుక్కలవాళ్ళు, బవనీలు, జక్కులోళ్ళు అందరూ నిరాధారులమయ్యాం. మా ఆటకీ, పాటకీ, మా ధారణకీ విలువేలేదు" నిట్టూర్చి అన్నాడు దక్షుడు.

"అవును దక్షుడా... ముమ్మాటికీ అవును. అవునుగానీ, మీరు వీరశైవులంటారు నిజమేనా?" అడిగాడు సోములు.

"చైతన్యాన్నే 'శివం' అంటారు. ఆ చైతన్యం శ్వాస రూపంలో శరీరానికి వచ్చినంతకాలమూ అందరం శైవులమే. శ్వాస ఆగిన మరుక్షణం, అందరం శవాలమే" నవ్వి అన్నాడు దక్షుడు.

"గతపు వైభవాలు వంశాలూ గోత్రాలూ మీరు చెబుతారు గదా, భవిష్యత్తులో ఏ వంశాలూ గోత్రాలూ వుంటాయో మీకు సూచనగానైనా తెలీదా?" అడిగాడు సోములు.

"తెలిసిన వాళ్ళువున్నారు. పుస్తకాలంటూ మాకు వుండవు. అన్నీ వుండేది జ్ఞాపకంలోనే. భవిష్యత్తు గురించిన సమాచారం కూడా మెదడులోనే వున్నవాళ్ళు వున్నారు. అయితే వాళ్ళొక పట్టాన చెప్పరు" జవాబిచ్చాడు దక్షుడు.

"నీకు తెలిసిన వాళ్ళు లేరా తాతా?" అడిగాడు సోములు.

"అయ్యా. తెలిసినా నేను చెప్పకూడదు. అది మా పిచ్చికుంట్ల జీవలక్షణం. తెలుపుడు అవ్వాల్సిన సమయంలో తెలుపుడు అయితీరుతుందని మా మల్లన్న మాట" చుట్ట వెలిగించాడు దక్షుడు.

"తాతా అమ్మమ్మ రమ్మంటోంది" ముద్దుగా అన్నాడు చినమల్లుడు.

చినమల్లుడు తాతకి దేవుడిచ్చిన మనవడు. అమ్మమ్మ అనబడే భ్రమరాంబ కూడా దక్షుడికి ఏమీకాదు. భ్రమరాంబ వయసు నలభై అందరూ అమ్మా, అమ్మమ్మా అంటారు. దక్షుడ్ని తాతా అంటారు. ఎప్పుడో ఓ అగ్ని కుల క్షత్రియుడు తుమ్మకోటలో ఓ సత్రం కట్టించాడు. అది కట్టించి వందేళ్ళయినా బాగానే వుందిట. ఇప్పటికీ బాటసారులకీ నిర్వాహకులకీ ఆశ్రయం ఇస్తూనే వుంది. ఆ సత్రానికి తలుపులు, కిటికీలు లేవు. ఏ మహానుభావుడు ఎత్తుకుపోయాడోగానీ, అది ఇప్పుడు పబ్లిక్ ప్రాపర్టీ. భ్రమరాంబ విస్తళ్ళు కుడుతుంది. ఆకు దొన్నెలు చేస్తుంది. తెల్లారుఝామునే స్నానం చేసి, రూపాయి బిళ్ళంత బొట్టుపెట్టుకుని పొయ్యి వెలిగించి ఇడ్లీలు తయారు చేస్తుంది. చక్కని పచ్చళ్ళు నూరి సిద్ధం చేస్తుంది. ఆ సత్రంలో భ్రమరాంబ ప్రర్మినెంట్ మెంబర్,దక్షుడిలాగే. చినమల్లుడు భ్రమరాంబకి మనవడు. ఎలా మనవడయ్యాడో ఎవరికీ తెలీదు.

"వస్తాను మల్లా వస్తాను. సోములు కూడా భోజనానికి వస్తాడని చెప్పు" చిన్నమల్లుడ్ని ముద్దుపెట్టుకుని అన్నాడు దక్షుడు.

"నాకెందుకులే" తలాడించాడు సోములు.

"అయ్యా. భ్రమరాంబ పెట్టే భోజనం గుళ్ళో ప్రసాదంలాంటిది. హాయిగా తిని వెళ్దువుగాని" లేచి సత్రం వైపు అడుగులు వేశాడు దక్షుడు. అనుసరించాడు సోములు.

"ఓపిక తగ్గడం సహజం. అందరూ ఇప్పుడు బాధపడుతున్నది దానివల్లనే. దేనికి ఎదురు చూడాలో, ఎందుకు ఎదురు చూడాలో తెలియని స్థితి చాలా చాలా భరించరానిది. సుదర్శన్, వీలుంటే నీ గవ్వలు ఓసారి ఉపయోగించు" అన్నీ సర్దుకుని బయలుదేరడానికి సిద్దంగా వున్న సుదర్శన్‌తో అన్నది మదాలస.

"మదాలసా నా మనసు స్థిరంగాలేదు. ఈ గవ్వలు విసిరి భవిష్యత్తుని లెక్క కట్టడం అనేది అనుకున్నంత తేలికకాదు. మనసు నిశ్చలంగా వున్నప్పుడే అది సాధ్యం. వ్యాకులంగా వున్నప్పుడు కాదు. అయినా, దానివల్ల ఉపయోగం వుంటే శాస్త్రిగారే అడిగేవారు కదా! ఎందుకో షోలింఘర్ వెళ్ళిపోవాలనిపిస్తోంది. బహుశా రాబీకూడా త్వరలో అమెరికా వెళ్ళిపోవచ్చు. వెనక్కి వచ్చెయ్యమని వారి అన్నగారు అన్నారని చెప్పాడు. అతనితోబాటే జయ్ కూడా వెళ్ళిపోతాడేమో" నిర్లిప్తంగా అన్నాడు సుదర్శన్. మామూలుగా అయితే హార్స్‌లీ హిల్స్ అద్భుతం.

కేవలం ఎదురు చూసే పని అయితే ఏ అద్భుతమైన స్థలమైనా చెరసాలలాంటిదే. మదాలస మాట్లాడలేదు. కిచెన్‌లోకి వెళ్ళి ఆరుకప్పుల టీ తయారు చేసి, మొదట సుదర్శన్‌కి ఇచ్చి, మిగతావి అందరూ కూర్చున్న గార్డెన్‌లోకి తీసుకెళ్ళింది. వాతావరణం గంభీరంగా వుంది. అందరూ మౌనంగా టీ కప్పులు తీసుకున్నారు.

"కోటి మందిలో ఒకరికి కూడా ఇటువంటి అనుభవం కలగదు. ఎవడు నాలో ప్రవేశించడం, నన్ను స్థబ్దుగా వుంచడం, ఏవేవో ఊహించని చిత్రాలు జరగడం, అవన్నీ రేపటికాలానికీ రాబోయే విపత్తుకీ సూచనలుగా భావించడం. ఇదంతా ఓ కలలానే వుంది. పచ్చి అబద్దంలాగా కూడా ఉంది. అయితే ఇందులో అనుభవం నాదే"ఆగాడు రాబీ వెజ్ స్టర్.

ఎవరూ మాట్లాడలేదు. వింటున్నారు.

"మహాభారతం గురించి నా నాలెడ్జి సున్నా,శాస్త్రిగారు చెప్పాక కొంచెం అర్థమయింది. అప్పటి ఆయుధాలు నాకు కనబడటం ఏమిటీ? ఒకవేళ కనబడినా, జరిగేదీ, జరగాల్సిందీ ఏముంటుందీ? అసలు ఆ పాతబడిన ఆయుధాలవల్ల ఇప్పుడు ఏమి ఉపయోగం వుంటుందీ, బహుశా వాటిని పురాతన వస్తువులుగా (యాంటిక్స్) కొన్ని మిలియన్స్‌కి అమ్ముకోవచ్చా. జయ్, మీదేశం ఓ లాండ్ ఆఫ్ మిస్టరీ. అయితే, నాకు దీంతో పనిలేదు" సూటిగా జయ్‌నీ మిగతా వారినీ చూసి అన్నాడు రాబీ.

చిన్నగా నవ్వారు శాస్త్రిగారు.

"ఎందుకు నవుతున్నారు?" కొంచెం సీరియస్‌గానే అన్నాడు రాబీ.

"అసలిదంతా మొదలయిందే నీతో. అందరూ సమావేశమవుతుందీ నీకోసమే. నీగురించిన ఆందోళనతోనే ఇన్నాళ్ళూ అందరం పరితపించాం. రాబీ, వెళ్ళిపోవాలనే వుంటే తప్పక వెళ్ళు. నువ్వు వెళ్ళిపోవడం వల్ల సమస్య సమసిపోతుందని నాకు అనిపించడం లేదు. అయినా, నిన్నుగానీ మిగతావారిని గానీ ఉండమని బలవంతం చెయ్యలేను.

యజ్ఞప్పగారూ మేరేమంటారు?" యజ్ఞప్పని అడిగారు శాస్త్రిగారు. "మీరన్నది నిజమే. ఏదెలా జరగాలో అది జరక్కమానదు. మన ప్రమేయం వున్నా, లేకపోయినా" స్పష్టంగా అన్నాడు యజ్ఞప్ప.

"జరిగింది ఇంతే. మేము పదిహేను రోజులపాటు వెతికినా ఏమీ దొరకలేదు. అయ్యా.. ఒక వెలుగు భూమిలోంచి పైకి చాలా ప్రకాశంతో ప్రకాశించడం చూసిన మాట వాస్తవం. ఆ తర్వాత ఎంత వెదికినా ప్రయోజనం కనబడలేదు" వివరించాడు మట్టూ.

"బహుశా వర్షపు నీటితోనో, జారిపడ్డ బండల్తోనో ఆ వెలుగుకి కారణమైనది కప్పుపడి ఉండొచ్చు" సాలోచనగా అన్నాడు రామజోగి.

"అయ్యా మరో విషయం. అరిదమనుడి తండ్రిగారు అరిదమనుడిని ఓ మాట అడిగారట" అంటూ అలంబస, అరిదమనుల పూర్వాపరాలు వివరించాడు మట్టు.

"ఏమాట?" ఆశ్చర్యంగా అన్నాడు రామజోగి.

"అదే విచిత్రం. ఆయన చెప్పబోయేముందు పనిగత్తెలు దీపాలు వెలిగించే ప్రయత్నం చేశాడు. బాలకులు సూక్తాలు వల్లిస్తున్నారు.  ఓ పళ్ళెం ఛల్లున కిందపడింది. అందరమూ అటువైపు చూశాం. అరిదమనులవారు ఏం చెప్పారో మాకు వినిపించలేదు. సంకల్పానందగారు విన్నారో లేదో కూడా తెలీదు. నా పరిస్థితీ అదే" తలవొంచుకుని అన్నాడు మట్టు.

"నాతోనూ అలంబసుడు ఏదో చెప్పాడు. ఎంత ప్రయత్నించినా నాకది గుర్తురావడంలేదు. ఆలోచించగా ఆలోచించగా అసలు ఆయన చెప్పడం, నేను వినడం, నిజమేనా అనిపిస్తోంది" నిట్టూర్చి అన్నాడు శృంగి. చిన్నగా నవ్వాడు రామజోగి.

"మట్టూ ఆలోచించకు. ఆ మాటలు బహుశా కొందరికి మాత్రమే అన్వయిస్తాయేమో. సంకల్పానందగారు కూడా విన్నారో లేదో? ఏదయినా వారిద్దరూ చెప్పదలచుకున్నవి చెప్పారు. ఇటు శృంగీ అటు మీరూ కూడా నిమిత్తమాత్రులే. ప్రతి పని వెనుకా ఓ అద్భుతమైన కాలరచన వుంది. ఒక భరతుడు పుట్టాలి. ఎవరికీ బ్రహ్మర్షి కావాలనుకున్న ఓ రాజర్షికీ, ఓ అప్సరాంగనకీ పుట్టిన శకుంతల అనే స్త్రీకి. చెప్పుకోవడానికి రెండు మాటలే. కానీ అది సత్యమై లోకంలో ఉద్భవించడానికి ఎంతకాలం తీసుకుందీ? సరేనయ్యా శకుంతల పుట్టింది. పుట్టగానే ఇటు విశ్వామిత్రులు, అటు మేనకా ఆ పసికందుని ఎందుకు వదిలిపోయారు? పక్షులూ, కణ్వమహర్షీ ఆ పిల్లని ఎందుకు పెంచారు? అభం శుభం తెలీని ఆ కన్యని దుష్యంతుడు ఎందుకు మోహించాలీ? మోహించి ఎందుకు మోసగించాలీ? చివరికి భరతుడ్ని ఆ దుష్యంతుడే కుమారుడిగా ఎందుకాదరించాలీ?" ఇదీ.. కాలరచన అంటే" ఆగాడు రామజోగి. లోపలనించి మధుర అంతా వింటోంది.

"స్వామీ ఇప్పుడూ జరిగిన ఆ యజ్ఞం పూర్ణమయినట్లా, అసంపూర్ణంగా ఆగినట్టా?" అడిగాడు మట్టూ.

"పొలందున్ని విత్తనాలు నాటాం. పంట చేతికి రావాలంటే చాలా పనులు జరగాలిగా. విశ్వశాంతి మహాయజ్ఞానికి ఓ బీజం నాటబడింది. ఆ బీజం భూమిని చీల్చుకుని మొక్కగా మారాలంటే సమయం పట్టక తప్పదు. వేచి చూడటం ఒకటే ప్రస్తుతం మనం చెయ్యగలిగింది.

మోహన్ గిరి ఫకీర్‌ని గమనిస్తూనే వున్నాడు. ఫకీరూ మోహన్‌గిరిని చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాడు. ఫకీరు రకరకాల మాయలతో కాశీలో సంచరిస్తున్న కుర్రాళ్ళని ఆకర్షించి తన శిష్యులుగా మారుస్తున్నాడు. రోజురోజుకీ వారి సంఖ్య పెరుగుతూనే వుంది.

ఎవరెవరో కాశీకి వస్తున్నారు. ఒక పవిత్రత, నిర్లిప్తత నిండి వుండే నగరంలో ఇప్పుడు ఓ తెలీని అలజడి అలుముకుంది. జేబుదొంగలనించి కత్తి చూపించి జేబుల్లో డబ్బులు కాజేసేంత దౌర్జన్యం కాశీలో కాలూనింది. ఒకప్పుడు తెల్లవర్లూ సాధువులు హర హర మహాదేవ్ అంటూ జపం చేసుకునేవారు. ఇప్పుడు గాలిలో ఆ పవిత్ర నామస్మరణ లేదు. గాలిలో గంజాయి పొగ కలిసి గుండెలు అవిసేలా చేస్తోంది. భక్తుల్లోనూ ఓ ఉన్మత్తత. ఎంత తొందరగా దర్శనం కానిచ్చుకుని వెళ్ళిపోదామా అన్న ఆరాటం. మోహన్ అన్నీ గమనిస్తున్నాడు. అతని మనసులోనూ ఎందుకో తెలీని ఓ ఆరాటం.

"హుక్కా లేదుగానీ, బీడీ కాలుస్తావా?" ఓ సాధువు అన్నాడు మోహన్‌తో.

"వద్దు"

"అలవాటులేదా?"

"లేదు"

"మాట్లాడొచ్చా సోదరా! ఈ మహా స్మశానం ఎప్పుడూ మౌనంగానే వుంటుంది. ముఖ్యంగా యీ అర్ధరాత్రిలో. మౌనం అంటే నాకు భయం. చావంటే భయం గనక పుట్టాను. మౌనం అంటే భయం గనక మాట్లాడుతున్నాను. జీవితం అంటే భయం గనక సన్యసించాను. మిత్రమా భయమే నేను. నేనే భయం. మాట్లాడకపోతే పోనీ కనీసం వింటావా? నువ్వు కాదంటే యీ అర్ధరాత్రిలో మరో దిక్కు నాకు లేదుకదా!" బీడీ దమ్ములాగి అన్నాడా సాధువు. అతని కళ్ళు బీడీ వెలుగులో పాము కళ్ళలా మెరిశాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments